APTEL /25/A2860

సీమ వార్త
తెలుగు దినపత్రిక

E వార్త NEWS

విలేకరులు కావలెను
సీమ వార్త తెలుగు దినపత్రిక ఏపీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల వారీగా బ్యూరో ఇన్చార్జులు స్టాఫ్ రిపోర్టర్లు ఆర్సి ఇన్చార్జిలు వెంటనే కావలెను అర్హత కనీసం డిగ్రీ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
వివరాలకు సంప్రదించండి
చీఫ్ ఎడిటర్ బీరె ఈశ్వరయ్య
9490860881

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 216 | పేజీలు : 4 | బుధవారం 13 మే 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-

## అమరావతిలో ఎమ్మెల్యే
# క్వార్టర్ల పూర్తి



- వారం రోజుల్లో వాటిని జీఏడీకి అప్పగిస్తాం
- తుది దశకు ఐఏఎస్ అధికారులు, మంత్రుల బంగళాలు
- అమరావతిలో రైతులకు 98 శాతం ప్లాట్ల కేటాయింపు పూర్తి
- మీడియా సమావేశంలో మంత్రి నారాయణ

**అమరావతి**

అమరావతిలో ఎమ్మెల్యే క్వార్టర్ల నిర్మాణం పూర్తయ్యాయని, వారం రోజుల్లో వాటిని జీఏడీకి అప్పగిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు. అమరావతిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజధానికి భూములిచ్చిన రైతులకు 98 శాతం ప్లాట్ల కేటాయించాం. ఇంకా కేవలం 674 మందికి మాత్రమే ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉంది. కేటాయించిన ప్లాట్లలో 89 శాతం రిజిస్ట్రేషన్ కూడా పూర్తయిందని వెల్లడించారు. కోర్టు కేసులు,కుటుంబ వివాదాలు ఉన్న వారికి మాత్రమే ప్లాట్ల కేటాయింపు పెండింగ్ లో ఉందని స్పష్టత ఇచ్చారు. రాజకీయ కుట్రతోనే వైసీపీ రైతుల విషయంలో రాద్ధాంతం చేస్తుందని ఆరోపించారు. రాజధానిలో ప్లాట్ల కేటాయింపులో పాలసీ ప్రకారం నిబంధనలకు అనుగుణంగానే ముందుకెళ్లాం. అమరావతిలో ట్రంక్ రోడ్లు,లే - మిగతా3లో



## ఆలస్యానికి చెక్..
# రవాణా శాఖ కొత్త ఒరవడి

**వాహనాల రిజిస్ట్రేషన్ 24 గంటల్లో పూర్తి**

**రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి వెల్లడి**

**అమరావతి**

రాష్ట్రంలో కొత్త వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇకపై 24 గంటల్లో పూర్తి చేసే విధంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒకప్రకటన విడుదల చేశారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కొత్త వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనవసర జాప్యాలు జరుగుతున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా వేలాది వాహనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇకపై డీలర్ తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసిన అనంతరం, ఫ్యాన్సీ నంబర్ కోరని వాహనాలకు సంబంధించిన దరఖాస్తులను రవాణాశాఖ అధికారులు 24 గంటల్లో పరిశీలించి ఆమోదించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా అధికారులు స్పందించని పక్షంలో, 24 గంటల - మిగతా3లో

### శబరిమల ఆచారాల్లో సంస్కరణ ౦ కావాలని ప్రజలు కోరితే- మేము అంగీకరిస్తాం

- శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళల పట్ల వివక్ష కేసులో సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు
- ఈ సమస్యకు సామాజిక సంస్కరణలు అవసరమని ప్రజలందరూ ఏకతాటిపైకి వస్తే తాము అంగీకరిస్తామని వెల్లడి






## నీట్ పరీక్ష రద్దు

- సీబీఐ దర్యాప్తునకు ఆదేశం
- త్వరలోనే కొత్త తేదీలు ప్రకటిస్తామన్న ఎన్‌టీఏ
- మే 3న జరిగిన నీట్ యూజీ పరీక్ష రద్దు చేయాలని ఎన్‌టీఏ నిర్ణయం
- చెల్లించిన ఫీజు రీఫండ్- సీబీఐ దర్యాప్తునకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడి

### అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ ప్రమాణ స్వీకారం



- ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు
- అసోంలో వరుసగా మూడోసారి కొలువుదీరిన ఎన్‌డీఏ ప్రభుత్వం

2



### ప్రధాని అమృత్ కాలం దేశానికి విషంగా మారింది

- నీట్ రద్దుపై రాహుల్ గాంధీ ఫైర్
- నీట్ రద్దుతో 22 లక్షల మంది విద్యార్థుల కలలు ఛిన్నాభిన్నమయ్యాయని ఆవేదన
- ప్రతిసారీ పేపర్ లీక్ మాఫియా శిక్ష లేకుండా తప్పించుకుంటోందన్న రాహుల్



### బలపరీక్ష వేళ- అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలతో సీఎం విజయ్ భేటీ

- విజయ్‌కు మద్దతు ఇస్తామని ఇప్పటికే ప్రకటించిన షణ్ముగం
- బలపరీక్ష నేపథ్యంలో షణ్ముగం, విజయ్ భేటీకి ప్రాధాన్యం

## అత్యధిక మార్కులు సాధించిన
# బీసీ విద్యార్థులకు నగదు బహుమతి

**మెమోంటోలతో పాటు సత్కారం**

**2027లో మెరుగైన ఫలితాలే లక్ష్యం**

**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా స్కూళ్ల బ్యాగ్‌ల పంపిణీ**




**అమరావతి**

బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతూ పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత నగదు బహుమతి పంపిణీ చేశారు. అదేవిధంగా మెమోంటోలతో పాటు వారిని సత్కరించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు బీసీ వర్గాలకు మాత్రమే కాకుండా సమాజానికే ఆదర్శం నిలిచారని కొనియాడారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎంజేపీ గురుకులాలు, బీసీ వసతి గహాల విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. - మిగతా3లో




## తెలుగు రాష్ట్రాలకు తాగునీటి విడుదల

- కేఆర్ఎంబీ నిర్ణయం
- ముగిసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం
- తెలంగాణ, ఏపీ తాగునీటి అవసరాల మేరకు నీటి విడుదలకు నిర్ణయం
- శ్రీశైలం, సాగర్ నుంచి నీటి విడుదలకు కుదిరిన అంగీకారం

**హైదరాబాద్**

తెలంగాణ, ఏపీ తాగునీటి అవసరాల మేరకు నీటి విడుదలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం, సాగర్ నుంచి నీటి విడుదలకు కేఆర్ఎంబీ అంగీకారం తెలిపింది. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి - మిగతా3లో

## ముళ్లకంచెకు భయపడేది లేదు

- సరిహద్దుల్లో బంగాల్ బాబ్డ్‌వైర్‌పై స్పందించిన బంగ్లా
- సరిహద్దులో కంచె నిర్మాణంపై బంగాల్ ప్రభుత్వం నిర్ణయం
- స్పందించిన బంగ్లాదేశ్
- సరిహద్దు భద్రత విషయంలో భారత్ మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని వ్యాఖ్య



## శబరిమల ఆచారాల్లో సంస్కరణ కావాలని ప్రజలు కోరితే

# మేము అంగీకరిస్తాం



శబరిమలలోకి రుతుక్రమ వయసు గల మహిళలను మినహాయించడం ఒక నిషిద్ధం అవుతుందా లేదా అనేది అంతిమంగా వ్యక్తిగత మనస్సాక్షికి సంబంధించిన విషయమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రజలు తమ ద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ద్వారా ఈ పద్ధతికి సామాజిక సంస్కరణలు అవసరమని సమష్టిగా నిర్ణయిస్తే, అటువంటి సంస్కరణలను కోర్టు అంగీకరించే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళ వివక్షపై దాఖలైన పిటిషన్లు, దావూదీ బోహ్రాలతో సహా పలు మతాలు పాటిస్తున్న మత స్వేచ్ఛ పరిధి, విస్తృతికి సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చిలతో కూడిన 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

**రుతుక్రమ వయసే అసలు సమస్య**

ఈ కేసులో కొన్ని పక్షాల తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది విజయ్ హన్సరియా కీలక వ్యాఖ్యలు చేశారు. శబరిమల ఆలయం విషయంలో మహిళలపై ఆంక్షలు విధించడానికి గల ముఖ్య కారణం వారి రుతుక్రమ వయసేనని అన్నారు. "నన్ను ఒక 10 ఏళ్ల బాలికగా పరిగణించండి. నేను కుటుంబంతో కలిసి ఆలయానికి వెళు_న్నాను. రుతుక్రమం వయసొచ్చిన తర్వాత నేను ఆలయానికి వెళ్లడం నిషిద్ధం" అని హన్సరియా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు పదేళ్ల వయసులో ఆలయంలోకి ప్రవేశించడాన్ని నిషిద్ధంగా భావిస్తే అది నిషిద్ధమే. అలా భావించకపోతే ఏదీ కాదు. మీరు దానిని ఎలా చూస్తారన్నదే ప్రశ్న. ఒక భక్తుడు, భక్తుడు కానివారు దానిని ఎలా చూస్తారన్నదే దానిపై ఆధారపడి ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ మనస్సాక్షిని అనుసరించాలి" అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు.

తాను ఒక భక్తుడినే అయినా, కొందరు శబరిమల ఆలయంలోకి రుతుక్రమం అయ్యే మహిళలు ప్రవేశించడం నిషిద్ధమని అంటారని సీనియర్ అడ్వకేట్ విజయ్ హన్సరియా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని తన మనస్సాక్షి నిషిద్ధంగా గానీ, కళంకంగా గానీ పరిగణించదని అన్నారు. సామాజిక సంక్షేమం కోసం రూపొందించిన రాష్ట్ర చట్టాన్ని, అది మతపరమైన ఆచారాలను ప్రభావితం చేస్తుందన్న ఏకైక కారణంతో కొట్టివేయకుండా సమర్థించాలని సుప్రీంకోర్టును కోరారు. "ఇది ఒక మతపరమైన ఆచారం. దీనికి సామాజిక సంస్కరణ అవసరం. అయినప్పటికీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 2(బి) కింద ఒక చట్టం చేసినప్పటికీ అది ఒక ఆవశ్యక మతపరమైన ఆచారం అనే కారణంతో ఆ చట్టాన్ని కొట్టివేయలేం. ఎందుకంటే ఆర్టికల్ 26 (బి), ఆర్టికల్ 25 (1)తో పాటు ఆర్టికల్ 26ను కూడా ఆ ఆచారం అధిగమిస్తుంది" అని విజయ్ హన్సరియా తెలిపారు.

**సీజేఐ కీలక వ్యాఖ్యలు**

ఉదాహరణకు, ఏదైనా రాష్ట్రం అన్ని వయసుల మహిళలను ఆలయంలోకి ప్రవేశాన్ని అనుమతిస్తూ చట్టం చేస్తే అది ఆర్టికల్ 26 (బి)ని ఉల్లంఘిస్తోందనే కారణంతో ఆ చట్టాన్ని కొట్టివేయవచ్చా? అని హన్సరియా సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సమాధానమిచ్చారు. అలాంటప్పుడు భవిష్యత్తులో న్యాయస్థానాలు తీర్పు వెలువరించడానికి సంకోచిస్తాయని అభిప్రాయపడ్డారు. "ఈ దేశ ప్రజలు తమ ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధుల ద్వారా శబరిమలలో మహిళల ప్రవేశంపై ఆంక్షల సమస్యకు సామాజిక సంస్కరణలు అవసరమని ఏకతాటిపైకి వచ్చినట్లైతే న్యాయస్థానం దానిని ఒక సామాజిక సంస్కరణగా అంగీకరిస్తుంది. కానీ అది ప్రజల కోరికలకు, అభీష్టానికి వ్యతిరేకంగా ఉంటే న్యాయస్థానం జోక్యం చేసుకుంటుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

**ఇదీ కేసు నేపథ్యం?**

శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10–50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని 2018లో ఐదుగురు జడ్జీల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎత్తివేసింది. ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలు కాగా, 9 మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం విచారణ చేపట్టింది.

# ముళ్లకంచెకు భయపడేది లేదు



భారత్– బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ నూతనంగా ఏర్పాటైన బంగాల్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై బంగ్లాదేశ్ స్పందించింది. ముళ్లకంచెకు బంగ్లాదేశ్ భయపడదని ఆ దేశ విదేశాంగ వ్యవహారాల సలహాదారు హుమయున్ కబీర్ తెలిపారు. సరిహద్దు భద్రత విషయంలో భారత్ మరింత మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ఢాకాలో మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. బంగాల్ ప్రజలు, ప్రభుత్వం ముళ్ల కంచెకు భయపడదని హుమాయున్ కబీర్ తెలిపారు. దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైనప్పుడు భారత్‌తో చర్చలు జరుపుతామని తెలిపారు. తాము మాట్లాడాల్సిన అవసరం ఉన్న చోట తప్పకుండా మాట్లాడతామని అన్నారు. కొత్త బంగాల్ ప్రభుత్వ ఎన్నికల ప్రచార వ్యాఖ్యలు నిజంగా అమల్లోకి వస్తాయా లేదా అనేది గమనిస్తామని చెప్పారు. భారత్ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవాలనుకోవడం లేదని తెలిపారు. తమ సంబంధాలు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతోనే ఉంటాయని పేర్కొన్నారు. భారత్– బంగ్లాదేశ్ మధ్య ప్రజల మధ్య సంబంధాలు మరింత బలపడాలంటే సరిహద్దు భద్రత విషయంలో భారత్ మానవీయ దృక్పథాన్ని అవలంబించాలని కబీర్ సూచించారు. ఇప్పటికే కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, రెండు దేశాల నాయకత్వం ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడంపై కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

**సరిహద్దు భద్రతపై అధికారి కఠిన వైఖరి**

బంగాల్?లో ఎన్?డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం సువేంద్ అధికారి నేతృత్వంలో సోమవారం తొలి క్యాబినేట్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు కంచె నిర్మాణానికి అవసరమైన భూములన్నింటినీ బీఎస్?ఎఫ్?కు అప్పగిస్తామని పేర్కొంది. మరో 45రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది. సరిహద్దు కంచె నిర్మాణానికి అవసరమైన భూముల బదిలీని గత ప్రభుత్వం తృణమూల్ కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసిందని బీజేపీ చాలా కాలంగా ఆరోపిస్తోంది. అయితే స్థానిక ప్రజల జీవనోపాధి, భూసంబంధిత సమస్యలను దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని టీఎంసీ వాదిస్తూ వచ్చింది. అయితే బంగాల్ ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్? షా, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న భూములన్నింటినీ 45 రోజుల్లో బీఎస్?ఎఫ్?కు బదిలీ చేస్తామని హామీ ఇచ్చారు.

**850 కిలోమీటర్ల మేర కంచె పెండింగ్**

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, బంగాల్‌కు బంగ్లాదేశ్‌తో మొత్తం మొత్తం 4,097 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. అందులో ఇప్పటికే సుమారు 3,240 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణం పూర్తయ్యింది. ఇంకా దాదాపు 850 కిలోమీటర్ల ప్రాంతంలో కంచె నిర్మాణం మిగిలి ఉండగా, అందులో 175 కిలోమీటర్లు క్లిష్ట భూభాగంగా గుర్తించారు.

తొలి క్యాబినేట్ సమావేశంలో కంచె నిర్మాణం గురించే కాకుండా పలు కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది సువేందు సర్కార్. కేంద్రం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకంలో తమ రాష్ట్రాన్ని చేరుస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 1నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపింది. అలాగే రాష్ట్రంలో మహిళలకు జూన్ 1 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. క్రిమినల్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లను తమ రాష్ట్రంలో కూడా అమల్లోకి తీసుకొస్తామని వెల్లడించింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇక బంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా మనోజ్ అగర్వాల్ నియమితులయ్యారు.

# నీట్ పరీక్ష రద్దు

నీట్ ప్రశ్నాపత్రం లీక్, పరీక్ష నిర్వహణలో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరీక్ష మళ్లీ నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయించింది. త్వరలోనే నీట్ యూజీ పరీక్ష తేదీలు ప్రకటిస్తామని తెలిపింది. ప్రశ్నపత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం, సీబీఐ విచారణకు ఆదేశించింది పరీక్ష నిర్వహణలో పారదర్శకతను కాపాడటానికి, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఎన్?డీఏ వెల్లడించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు విభాగాల నుంచి అందిన నివేదికల ఆధారంగా పరీక్షా ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించినట్లు తెలిపింది. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడం వల్ల పాత పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**ఫీజు రీఫండ్– త్వరలోనే కొత్త తేదీలు**

విద్యార్థులకు ఊరటనిచ్చేలా ఇప్పటికే చెల్లించిన పరీక్ష ఫీజును తిరిగి రీఫండ్ చేయనున్నారు. మళ్లీ నిర్వహించే పరీక్ష కోసం విద్యార్థులు ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎన్?టీఏ తన సొంత వనరులతోనే ఈ పరీక్షను నిర్వహించనుంది. రీ–ఎగ్జామ్ తేదీలు, కొత్త అడ్మిట్ కార్డుల వివరాలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ ద్వారా ప్రకటిస్తారు. పరీక్ష రద్దు వల్ల అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు కలిగే ఇబ్బందిని గుర్తించామన్న ఎన్?టీఏ, వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టేందుకు ఈ నిర్ణయం తప్పలేదని పేర్కొంది. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించింది. మరోవైపు నీట్ పరీక్షలో తలెత్తిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. సీబీఐ దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. అందుకు అవసరమైన అన్ని రికార్డులు, పత్రాలు, సమాచారాన్ని అందిస్తామని పేర్కొంది. రాజస్థాన్‌లోని కోటాలో నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకైనట్లు గుర్తించారు. కోటాలో కోచింగ్ సెంటర్లు ఇచ్చిన మెటీరియల్‌తో పోలి ఉన్నట్లు తేల్చారు. ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలు పరీక్షకు ముందు రాజస్థాన్‌తో కోచింగ్ సంస్థలు పంపిణీ చేసిన మెటీరియల్‌తో పోలి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈనెల 3న జరిగిన పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో నీట్ పరీక్షకు 42 గంటల ముందు వాట్సప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు నిర్ధారించారు. దీనిని విద్యార్థులకు రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారన్న ఆయన కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలు చేశారని గుర్తించామన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఎన్?టీఏ, నీట్ యూజీ–2026కి సంబంధించి అవకతవకలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. తర్వాత కేంద్ర విద్యాశాఖను సంప్రదించి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

**22.79 లక్షల మంది హాజరు**

దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ సహా వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్–యూజీ పరీక్ష మే 3న పెన్–అండ్–పేపర్ విధానంలో జరిగింది. భారత్‌లోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో కలిపి 5,400కు పైగా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

## ప్రధాని అమృత్ కాలం దేశానికి విషంగా మారింది

నీట్ రద్దుపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్న అమృత కాలం యువత పాలిట విషంగా మారిపోయిందని అన్నారు. నీట్ రద్దుతో 22 లక్షల మంది విద్యార్థుల కలలు ఛిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందరో తండ్రులు అప్పులు చేసి పిల్లలను చదివించారని, తల్లులు నగలమ్మి కోచింగ్ ఫీజులు కట్టారని రాహుల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తమ పిల్లలు నీట్ కోచింగ్ ఖర్చు భరించడం కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేశారని, కానీ ప్రతిఫలంగా వారికి పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా రంగంలో అవినీతి ఎదురవుతున్నాయని అన్నారు. లక్షల మంది పిల్లలు రాత్రింబవళ్లు నిద్రలేకుండా చదివారన్న ఆయన, ప్రభుత్వ వైఫల్యం వల్ల విద్యార్థులు దారుణంగా నష్టపోతున్నారని విమర్శించారు. ఇది కేవలం వైఫల్యం మాత్రమే కాదని, తీవ్రమైన నేరమని మండిపడ్డారు. ప్రతిసారీ పేపర్ లీక్ మాఫియా శిక్ష లేకుండా తప్పించుకుంటోందన్న కాంగ్రెస్ అగ్రనేత, చేయని తప్పుకు విద్యార్థులు మాత్రం శిక్ష అనుభవిస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు. "నీట్ 2026 పరీక్షను రద్దు చేశారు. 22 లక్షలకు పైగా విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలను ఈ అవినీతి బీజేపీ ప్రభుత్వం నాశనం చేసింది. కొందరు తండ్రులు అప్పులు చేశారు. మరి కొందరు తల్లులు తమ నగలు అమ్ముకున్నారు. లక్షలాది మంది పిల్లలు రాత్రంతా మేల్కొని చదువుకున్నారు. దానికి ప్రతిఫలంగా వారికి పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యారంగంలో వ్యవస్థీకృత అవినీతి ఎదురయ్యాయి. ఇది కేవలం వైఫల్యం మాత్రమే కాదు. ఇది యువత భవిష్యత్తుపై చేసిన నేరం. ప్రతిసారీ పేపర్ లీక్? మాఫియా తప్పించుకుంటుండగా, నిజాయితీపరులైన విద్యార్థులు మాత్రం శిక్షను అనుభవిస్తున్నారు. ఇప్పుడు లక్షలాది మంది విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థిక భారాన్ని భరించనున్నారు. ఒకరి తలరాతను కష్టంతో కాకుండా డబ్బు, పలుకుబడితో నిర్ణయిస్తుంటే ఇక చదువుకు అర్థం ఏముంటుంది? ప్రధానమంత్రి అమృత యుగం దేశానికి విష యుగంగా మారింది."

**'లోపభూయిష్టమైన వ్యవస్థతో ప్రభుత్వం విద్యార్థులను శిక్షిస్తోంది'**

మరోవైపు నీట్ రద్దుపై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. లోపభూయిష్టమైన వ్యవస్థతో ప్రభుత్వం విద్యార్థులను శిక్షిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేంద్రంపై విరుచుకుపడ్డారు. "పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో నీట్–యూజీ 2026 పరీక్ష మరోసారి రద్దయింది. రేయింబవళ్లు కష్టపడి చదువుకున్న లక్షలాది మంది విద్యార్థులు, పూర్తిగా లోపభూయిష్టమైన వ్యవస్థ కారణంగా శిక్షకు గురవుతున్నారు. ఏటా అదే కుంభకోణం, అవే సాకులు, అదే వేదన. ఈ విద్యార్థుల భవిష్యత్తును ఎవరు నాశనం చేశారు? దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అవినీతి, అసమర్థత కారణంగా ఇంకెంతమంది యువ మేధావులు ఒత్తిడి, మానసిక వేదనను అనుభవించాల్సి వస్తుంది? నిష్పక్షపాతంగా వైద్య ప్రవేశ పరీక్షను నిర్వహించలేని ఒక దేశం, ఇతరులకు 'నవ భారతం' గురించి నీతులు చెప్పలేదు. లోపభూయిష్టమైన వ్యవస్థ. లోపభూయిష్టమైన జవాబుదారీతనం. లోపభూయిష్టమైన ప్రధాని." అని మాణికం ఠాగూర్? మండిపడ్డారు.

**నీట్‌ను రద్దు చేసిన ఎన్‌టీఏ**

అంతకుముందు నీట్ యూజీ–2026 పరీక్ష రద్దు చేస్తూ నేషల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీూా) వెల్లడించింది. మే 3న జరిగిన నీట్ యూజీ పరీక్ష ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు తేలగా పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న చీూా, త్వరలో తేదీలు ప్రకటిస్తామని తెలిపింది. మరోవైపు ప్రశ్నపత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం జదీ× విచారణకు ఆదేశించింది. చీూా లెక్కల ప్రకారం, భారత్?లోని 551 నగరాల్లో, విదేశాల్లోని 14 నగరాలను కలిపి సుమారు 5,400కు పైగా కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. దీనికి దాదాపు 22.79 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

## బలపరీక్ష వేళ- అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలతో సీఎం విజయ్ భేటీ

తమిళనాడులో నూతనంగా ఏర్పడ్డ టీవీకే ప్రభుత్వం బలనిరూపణ చేసుకోవాల్సిన నేపథ్యంలో అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలతో సీఎం విజయ్ భేటీ అయ్యారు. అన్నాడీఎంకే నేత, ఎమ్మెల్యే షణ్ముగం ఇంటికి టీవీకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం విజయ్ వెళ్లి కలిశారు. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలకు షణ్ముగం నేతృత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విజయ్‌కు మద్దతు ఇస్తామని షణ్ముగం ప్రకటించిన నేపథ్యంలో ఆయన వర్గంతో విజయ్ సమావేశమయ్యారు. బుధవారం అసెంబ్లీలో బలపరీక్ష ఉన్న నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా, తమిళనాడు ఎన్నికల్లో తమ పార్టీ నుంచి గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యే కామరాజ్‌ను ఏఎంఎంకే నుంచి బహిష్కరించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత టీటీవీ దినకరన్ వెల్లడించారు. అధికార టీవీకే పార్టీకి ఏకపక్షంగా మద్దతు తెలిపి, పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు పార్టీలోని అన్ని పదవుల నుంచి, ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు వివరించారు. అతడి విజయం కోసం పని చేసిన కార్యకర్తలు, నమ్మకంతో ఓటు వేసిన ప్రజలకు కామరాజ్ ద్రోహం చేశాడని విమర్శించారు. అసెంబ్లీలో సీఎం విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి కామరాజ్ మద్దతు ప్రకటించిన కొన్ని గంటలకే ఏఎంఎంకే అధినేత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

**జ్యోతిష్యుడికి కీలక పదవి**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన ఆస్థాన జ్యోతిష్యుడికి ప్రభుత్వంలో కీలక పదవిని కట్టబెట్టారు. రాధన్ పండిట్ వెట్రివేల్‌ను ముఖ్యమంత్రి రాజకీయ వ్యవహారాలకు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విజయ్ ముఖ్యమైన పనులను చేపట్టే ముందు వెట్రివేల్‌ను సంప్రదిస్తారని తెలుస్తోంది. ఇటీవల మే 10న మధ్యాహ్నం 3 గంటల 45 నిమిషాలకు ప్రమాణ స్వీకారం అనుకున్నప్పటికీ వెట్రివేల్ సూచనతో ముహూర్తాన్ని ఉదయం 10 గంటలకు విజయ్ మార్చుకోవడం విశేషం. తమిళ రాజకీయాల్లో చాలా కాలం నుంచి వెట్రివేల్ చక్రం తిప్పుతున్నారు. దివంగత సీఎం జయలలిత సైతం ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఈయననే సంప్రదించేవారని రాజకీయ వర్గాల్లో ప్రతీతి. బీజేపీ, కాంగ్రెస్, డీఎంకే, అన్నా డీఎంకే నేతలకు ఈయన ఆస్థాన జ్యోతిష్యుడిగా మారారు. ఎన్నికలకు చాలాకాలం ముందే విజయ్ జాతకాన్ని విశ్లేషించిన వెట్రివేల్, ఆయనకు రాజకీయాల్లో అదృష్టం కలిసివస్తుందని జోస్యం చెప్పినట్లు తెలిసింది.

**ప్రజలకు ఇబ్బంది కలిగించేవారిపై కఠిన చర్యలు: టీవీకే**

మరోవైపు ప్రజలకు అసౌకర్యం కలిగించేలా లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో పార్టీల బ్యానర్లు పెట్టడాన్ని నిషేధిస్తున్నట్లు అధికార టీవీకే పార్టీ నిర్ణయించింది. ఎవరైనా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్యకర్తలకు వార్నింగ్ ఇచ్చింది. పార్టీ ప్రచారాల గురించి కాకుండా, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

## అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ ప్రమాణ స్వీకారం

అసోంలో వరుసగా మూడోసారి దీజీూ నేతృత్వంలోని చీణూ ప్రభుత్వం కొలువు దీరింది. సీఎంగా హిమంత బిశ్వ శర్మ రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటిలోని ఖానాపారా వెటర్నరీ కళాశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య సీఎంగా హిమంత బిశ్వ శర్మతో ప్రమాణం చేయించారు. ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు చరణ్ బోరో, అజంతా నియోగ్, అతుల్ బోరా, రామేశ్వర్ తెలితో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, సర్బానంద సోనోవాల్, శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియాలతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. సుమారు లక్ష మంది ఎన్డీఏ మద్దతుదారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

**ప్రమాణ స్వీకారం వేళ తూటాలతో వ్యక్తి అరెస్ట్**

ఇదిలా ఉండగా, అసోం ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వేదిక వద్ద ఒక వ్యక్తి బుల్లెట్లు పట్టుపడడం కలకలం రేపింది. పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకోగా, అతడి వద్ద కొన్ని తూటాలు ఉన్నట్లు తెలిపారు. ఖానాపారాలోని వెటర్నరీ కళాశాల మైదానం ప్రవేశ ద్వారం వద్ద జరిగిన భద్రతా తనిఖీల సమయంలో ఆ వ్యక్తి నుంచి ఈ బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణ నిమిత్తం అతడిని అదుపులోకి తీసుకున్నామని అధికారి చెప్పారు. అయితే, ఆ వ్యక్తి నుంచి ఎటువంటి ఆయుధాలు మాత్రం లభించలేదని ఆయన స్పష్టం చేశారు. ఈశాన్య భారత రాజకీయ యవనికపై అప్రతిహత శక్తిగా ఎదిగిన పేరు హిమంత బిశ్వ శర్మ. ఈయన 1969 ఫిబ్రవరి ఒకటిన జోర్హాట్‌లో కైలాష్ నాథ్ శర్మ , మృణాళిని దేవి దంపతులకు జన్మించారు. గువాహటిలో చదువుకున్న హిమంత బిశ్వశర్మ న్యాయశాస్త్రంలో పట్టా పొందారు.

సీమ వార్త
తెలుగు దినపత్రిక

# ఏపీలోకి టీవీకేపార్టీ..
# కాంగ్రెస్‌తో పొత్తు

**తిరుపతి :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ ప్రభంజనం సృష్టించింది.. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. టీవీకేతో కలిసొచ్చే పార్టీలతో కలిసి విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. సినిమాలతో అభిమానులతో మొదలైన విజయ్ ప్రస్థానం.. ఎన్నికల గెలుపు వరకు సాగింది. తమిళనాడులో పార్టీ ప్రారంభించిన రెండేళ్లలోనే తిరుగులేని విజయం సాధించడంతో టీవీకేలో కొత్త జోష్ నింపింది. విజయ్ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో ఓ ట్రెండ్ సెట్టర్‌గా మారారనే చెప్పాలి.. టీవీకే విజయం దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీసింది. తమిళనాడులో టీవీకే విజయం తర్వాత.. విజయ్ నెక్స్ట్ ప్లాన్ ఏంటి.. దళపతి తమిళనాడుతో ఆగుతారా పొరుగున ఉన్న రాష్ట్రాల్లోకి ఎంట్రీ ఇస్తారా అనే చర్చ మొదలైంది. ముఖ్యంగా విజయ్ కన్ను ఆంధ్రప్రదేశ్‌పై పడిందనే ఊహాగానాలు మొదలయ్యాయి.. టీవీకే అధినేత తమిళనాడు సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని విస్తరించే అవకాశం ఉందంటున్నారు. తమిళనాడు ఎన్నికలకు ముందు నుంచే ఆంధ్రప్రదేశ్ టీవీకే పార్టీ పేరుతో కొందరు సోషల్ మీడియాలో పేజీలు కూడా నడపుతుండటంతో టాక్ మొదలైంది. విజయ్ ముందు తమిళనాడులో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు టీవీకే పార్టీని విస్తరిస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి. విజయ్ ఆంధ్రప్రదేశ్‌వైపు రావడానికి కారణాలు చాలానే ఉన్నాయి. తమిళనాడులో విజయ్‌కు యువత నుంచి మంచి ఆదరణ వచ్చింది.. దళితులు, క్రిస్టియన్లు మద్దతు తెలిపారు. ఇక్కడ కూడా అడుగుపెట్టి ఆయా సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే అవకాశం ఉందంటున్నారు. ఏపీలో ముఖ్యంగా తీరప్రాంత జిల్లాలతో పాటుగా యువత, క్రిస్టియన్లు, దళిత ఓటర్లను ఆకట్టుకుంటే బలమైన రాజకీయశక్తిగా ఎదగొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే తమిళనాడుతో పోలిస్తే ఏపీలో క్రిస్టియన్ల సంఖ్య ఎక్కువగా ఉండటం కూడా కలిసొస్తుందంటున్నారు. తమిళనాడు ఫార్ములాను ఫాలో అవుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రస్తుతం ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు. టీవీకే పార్టీని విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్ మంచి ఆప్షన్ అనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే తెలుగు ఇండస్ట్రీ నుంచి, ఇతర రాజకీయ పార్టీల నుంచి వచ్చేవారిని ఏకం చేస్తే ఇంకా ప్లస్ అవుతుందంటున్నారు. అంతేకాదు విజయ్ టీవీకే పార్టీ ఏపీలో కాంగ్రెస్‌తో జతకట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తమిళనాడు సరిహద్దుతో పాటుగా మరికొన్ని చోట్ల టీవీకే అభ్యర్థులకు అవకాశం ఇచ్చి కూటమిగా బరిలోకి దిగే అవకాశాలు కొట్టిపారేయలేం అంటున్నారు. ఏపీ సరిహద్దులోని కొన్ని జిల్లాలపై తమిళనాడు ప్రభావం ఉంటుంది.. మిగిలిన చోట్ల బలపడాలంటే కష్టంగా ఉంటుంది. అందుకే ఏపీలో కాంగ్రెస్‌తో కలిసి ముందుకు సాగితే సక్సెస్ కావొచ్చు అంటున్నారు.



**యానాంలో ఘోర ఓటమి**

యానాంలో విజయ్ టీవీకే అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. యానాం నియోజకవర్గం కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్యలో ఉంది. ఈ నియోజకవర్గంలో తెలుగు ప్రజలు ఎక్కువ. రాజకీయంగా వారి ప్రభావం కూడా ఎక్కువే. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న యానాం నియోజకవర్గంలోని ఓటర్లు విజయ్ టీవీకేకు ఘోర పరాభవాన్ని రుచి చూపించారు. టీవీకే అభ్యర్థి తోట రాజు కేవలం 167 ఓట్లు మాత్రమే సాధించి డిపాజిట్ కూడా పోగొట్టుకున్నారు. టీవీకే అభ్యర్థి కంటే.. నోటాకు 193 ఓట్లు పడటం విశేషం. దీంతో తెలుగు ప్రజలు విజయ్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపు యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో 37,972 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 35,445 మంది అంటే 93.35 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్నార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లాడి కృష్ణారావు విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌పై మల్లాడి కృష్ణారావు 4,568 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా మల్లాడి కృష్ణారావు ఆరోసారి విజయం సాధించారు. మరోవైపు పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి విజయానికి హామీలు కూడా ప్రధాన కారణమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మంచినీటి ఏటీఎంలు, అటల్ క్యాంటీన్లు, బాలికలకు ఈ-స్కూటర్లు, స్థానికులకే ఉద్యోగ రిజర్వేషన్లు వంటి హామీలు ఓటర్లను ఆకర్షించాయి. మత్స్యకారులను వెనుకబడిన జాబితాలో చేరుస్తామని ప్రకటించడం కూడా కలిసి వచ్చింది. విజయ్ టీవీకే పార్టీ కూడా ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చటం ఎన్డీఏ కూటమికి కలిసి వచ్చింది.

# పరుగులు పెడుతున్న అమరావతి

**విజయవాడ :** అమరావతి రాజధాని నిర్మాణ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి తొలి దశ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉంది ప్రభుత్వం. ఒక రూపం తీసుకువచ్చి ఎన్నికలకు వెళ్లాలన్నది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ఓటమి వచ్చిన తర్వాత అమరావతి పునర్నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అమరావతిని ప్రపంచ నగరాల్లో ఒకటిగా నిలపాలన్నది చంద్రబాబు ఆలోచన. ఆ వ్యూహానికి తగ్గట్టు పనులు జరుగుతున్నాయి. అయితే ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలోనే అమరావతిపై చర్చ జరిగేది. కానీ ఇప్పుడు జాతీయ స్థాయిలో సైతం అమరావతిపై చర్చ జరుగుతోంది. దేశంలోని ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, జర్నలిస్టులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో జాతీయస్థాయిలో విస్తృత ప్రచారం జరుగుతోంది అమరావతి నిర్మాణంలో సాంకేతిక అంశాలను జోడిస్తోంది ప్రభుత్వం. ప్రధానంగా గ్రిడ్ తరహా డిజైన్, కృష్ణానది తీరాన అభివృద్ధి చెందుతున్న జోనల్ సిస్టం ఇప్పుడు ప్రచారంలోకి వస్తోంది. ప్రముఖ యూట్యూబర్ రాజన్ సింగ్ అమరావతి పనులపై రూపొందించిన వీడియో విపరీతంగా వైరల్ అవుతోంది. దేశ ప్రజలను ఆకర్షిస్తోంది. కేవలం సంక్షేమ పథకాలు కాదు.. శాశ్వతమైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాధాన్యతను అమరావతి నిరూపిస్తోందని ఈ వీడియో చూసిన వారు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ఏపీలో సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే.. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీగా అమరావతిని రూపుదిద్దుతున్నారు. ఇప్పటికే ప్రతిష్టాత్మక యూనివర్సిటీలు, ప్రపంచ స్థాయి విద్యాసంస్థల క్యాంపస్లు అమరావతిలో నెలకొల్పుతున్నారు. ఇదే విషయాన్ని చెబుతున్నారు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు. ప్రస్తుతం ఎండలకు తీవ్రత అధికంగా ఉంది. అమరావతి చుట్టుపక్కల



ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే ఈ ఎండల్లో సైతం అమరావతి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు ఎండలను కూడా లెక్క చేయకుండా జాతీయస్థాయి ఇన్ఫ్లుయెన్సర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి.. అక్కడ జరుగుతున్న అద్భుతమైన మౌలిక వసతుల కల్పనను రికార్డ్ చేస్తున్నారు. అత్యాధునిక రవాణా సౌకర్యాలు, విశాలమైన రహదారులు, పక్కాగా విభజించిన నివాస, వాణిజ్య జోన్లను చూసి ఇండియాలోనే అద్భుత నగరం అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. రాబోయే తరాలకు ఒక ఆదర్శప్రాయమైన మాడల్ అవుతుందని ఎక్కువమంది కామెంట్స్ చేస్తున్నారు. జాతీయ మీడియాలో సైతం ప్రత్యేక కథనాలు వస్తున్నాయి. తద్వారా అమరావతిలో పెట్టుబడులు పెడుతున్న ప్రైవేటు సంస్థలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

## విశాఖకు ఇన్నర్ రింగ్ రోడ్...

**విశాఖపట్టణం :** విశాఖ నగరాన్ని రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల మేర సెమీ రింగురోడ్డు నిర్మించనున్నారు. భోగాపురం విమానాశ్రయానికి ఏడు కనెక్టింగ్ రోడ్లు, బీచ్ కారిడార్‌తో పాటు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుస్తూ ఆర్థిక కారిడార్‌ను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది. విశాఖ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానించడానికి రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల పొడవైన సెమీ రింగురోడ్డును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఈ నెలాఖరు నాటికి సిద్ధం కానుంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే.. నగరం మధ్యలోకి భారీ వాహనాలు రాకుండా నేరుగా హైవేలకు అనుసంధానం అయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా నగర శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రాధాన్యతనిస్తూ.. దానికి ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు రోడ్ల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలినవి తుది దశలో ఉన్నాయి. విశాఖ నగరం నుంచి భోగాపురం వరకు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా ప్రత్యేక బీచ్ కారిడార్‌ను కూడా ప్రతిపాదించారు. ఇది పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే కాకుండా సముద్ర తీర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడుతుంది. నగరవాసుల ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విశాఖలోని 95 శాతం ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. అలాగే మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన 90 శాతం వినతులను అధికారులు పరిష్కరించారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మార్చడమే లక్ష్యంగా.. విశాఖ ఎకనామిక్ కారిడార్‌ను బలోపేతం చేస్తూ ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ రంగాలకు పెద్దపీట వేస్తున్నారు. ఈ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు విశాఖను గ్లోబల్ సిటీగా మార్చడంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు వెల్లడించారు.

## అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు నగదు బహుమతి

-మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయులు, వార్డెన్లు, అధికారులు, సిబ్బంది, తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. బీసీ సంక్షేమ శాఖను రాష్ట్రంలో ఆదర్శ శాఖగా తీర్చిదిద్దడంలో శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున్, ఎంజేపీ సొసైటీ కార్యదర్శి మాధవీలతతో పాటు అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది సమిష్టిగా కషి చేస్తున్నారని కొనియాడారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నానని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన ఉపాధ్యాయులు, ఆహారం, వసతులు అందుబాటులో ఉండటంతో బీసీ వెల్ఫేర్ విద్యాసంస్థలు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాల్లో బీసీ వెల్ఫేర్ రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని మంత్రి సవిత తెలిపారు. విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్న ఉద్దేశంతో త్వరలో స్పోర్ట్స్ మెటీరియల్ అందజేయనున్నామని మంత్రి సవిత తెలిపారు. వంట గదుల సామగ్రి కోసం రూ.18 కోట్ల నిధులు ఖర్చు చేశామన్నారు. ఎంజేపీ గురుకులాల శాశ్వత భవనాల నిర్మాణానికి రూ.500 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఒక్కో విద్యార్థిపై ఎంజేపీ గురుకులాల్లో రూ.1.50 లక్షలు, బీసీ హాస్టళ్లలో రూ.75 వేల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల సంఖ్యను గతంలో 42 నుంచి 109కి పెంచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదేనని మంత్రి గుర్తుచేశారు. నెల్లూరుకు చెందిన ప్రణీత టెన్త్ లో 589 మార్కులు సాధించినందుకు మంత్రి సవిత అభినందించారు. ఈ సందర్భంగా వేదికపై విద్యార్థిని ఇంగ్లీష్ లో మాట్లాడుతూ, తన విజయంలో ఉపాధ్యాయులతో పాటు తల్లి లక్ష్మీదేవి పాత్ర కూడా ఉందంటూ పేర్కొంది. అదే సమయంలో పక్కనే నిల్చొన్న విద్యార్థిని తల్లి లక్ష్మీదేవి తీవ్ర భావోద్వేగానికి గుర్యయ్యారు. తన కడుపున బిడ్డ ఇంగ్లీష్ లో అనర్గళంగా మాట్లాడుతుండడంతో ఆమె ఆనందభాష్పాలు రాల్చారు. ఎంజేపీలో సెకండ్ ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించి తమ గ్రూపుల్లో మొదటి స్థానంలో నిలిచిన ప్రియాంక(992 మార్కులు, ఎంపీసీ), శైలజా( 989 మార్కులు, బైపీసీ), దీప్తి(969 మార్కులు, ఎంఈసీ), హిమబిందు(981 మార్కులు, సీఈసీ)కు రూ.10 వేలు చొప్పున, ద్వితీయ స్థానంలో నిలిచిన భవానీ(989 మార్కులు, ఎంపీసీ), రాణి(987 మార్కులు, బైపీసీ), నిర్మలాజ్యోతి(966 మార్కులు, ఎంఈసీ), సరస్వతి(975 మార్కులు, సీఈసీ) రూ.5 వేలు చొప్పున నగదు బహుమతిని మెమోంటోలతో పాటు అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఎంజేపీ గురుకుల పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు టి.సాయిశ్రీ, జె.పవన్ కుమార్, ఎస్.గుణశేఖర్, డి.రీటాసాహితి, కె.యశ్వంత్ కుమార్, జి.షబానాకు రూ.10 వేలు చొప్పున, ద్వితీయ స్థానంలో నిలిచిన 27 మందికి రూ.5 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. బీసీ హాస్టళ్లకు సంబంధించి టెన్త్ అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురికి రూ.10 వేలు చొప్పున, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎనిమిది మందికి రూ.5 వేల చొప్పున అందజేశారు. ఇంటర్ లో సెకండియర్ లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఆర్సీ, ఎంఈసీ గ్రూపుల్లో అత్యధిక మార్కులతో నిలిచిన అయిదుగురి విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున, ద్వితీయ స్థానంలో నిలిచిన మరో అయిదుగురికి రూ.5 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. వారందరికీ మెమోంటోలు, సర్టిఫికెట్లతో పాటు మంత్రి తన తండ్రి పేరిట నిర్వహిస్తున్న ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా స్కూల్ బ్యాగ్‌లను ఉచితంగా అందజేశారు.

## ఆలస్యానికి చెక్.. రవాణా శాఖ కొత్త ఒరవడి

-మొదటిపేజీ తరువాయి

అనంతరం రిజిస్ట్రేషన్ స్వయంచాలకంగా ఆమోదం పొందినట్లుగా పరిగణించే విధానాన్ని ప్రభుత్వం తసుకువస్తోందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, సెలవు దినాల్లో కూడా ఆన్లైన్ విధానంలో ఆమోదాలు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. రవాణాశాఖ రూపొందించిన కొత్త విధానానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తీసుకురానున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

## అమరావతిలో ఎమ్మెల్యే క్వార్టర్ల పూర్తి

-మొదటిపేజీ తరువాయి

అవుట్ రోడ్లు,ఇతర నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అమరావతిలో అధికారులు,ఉద్యోగుల కోసం 4026 ఇళ్లను నిర్మిస్తున్నాం. ఆలిండియా సర్వీస్ అధికారుల భవనాలు, మంత్రుల బంగళాలు తుది దశకు చేరుకున్నాయి...ఈ నెలాఖరుకు కొన్ని ఇళ్లను వచ్చే నెలాఖరుకు మిగిలిన భవనాలు ప్రభుత్వానికి అందజేస్తాం..అలాగే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ -- డి భవనాల అంతర్గత పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. ల్యాండ్ పూలింగ్ కు రైతులు ముందుకు రాని చోట్ల తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ ఇచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు...ఇప్పటికీ ఆయా రైతులను ల్యాండ్ పూలింగ్ కు రావాలని కోరుతున్నామన్నారు...కొంతమంది ముందుకు వస్తున్నప్పటికీ మరికొంత మంది ఇష్టపడటం లేదన్నారు. అయితే కొంతమంది కోర్టును ఆశ్రయించారని..కోర్టు ఎలా నిర్ణయిస్తే దాని ప్రకారం ముందుకు వెళ్తామని స్పష్టం చేసారు.

# సిద్ధమైన కృష్ణాజలాల ప్రాజెక్టు

**విజయవాడ :** ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలోని కిడ్నీ బాధిత గ్రామాలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలను అందించే ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. సుమారు 15 తండాల్లోని 57 వేల మంది జనాభాకు ప్రతిరోజూ 22 లక్షల లీటర్ల నీటిని అందించేలా కుదప సంపు నుంచి పైప్‌లైన్ నిర్మించారు. గత పదేళ్లుగా కిడ్నీ వ్యాధులతో వందలాది మంది మరణించిన ఈ ప్రాంతంలో.. సురక్షిత నీటి సరఫరా ద్వారా వ్యాధులను అరికట్టడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా.. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఎ కొండూరు మండలం అంటేనే కిడ్నీ వ్యాధులకు నిలయంగా మారిపోయిన దుస్థితి. ఇక్కడి భూగర్భ జలాల్లో ఉన్న ఫ్లోరైడ్, ఇతర రసాయనాల కారణంగా వందలాది మంది గిరిజనులు కిడ్నీ వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ కిడ్నీ మరణాల పరంపరకు అడ్డుకట్ట వేయాలంటే సురక్షితమైన మంచినీటి సరఫరా ఒక్కటే మార్గమని దశాబ్ద కాలంగా బాధితులు మొరపెట్టుకుంటున్నారు. ఎట్టకేలకు ఈ ప్రాంత వాసుల కల నెరవేరుస్తూ.. కృష్ణా నది జలాలను తరలించే ప్రాజెక్టు నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తి చేసింది, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలోనే ఈ మండలంలో సుమారు 250 మందికి పైగా కిడ్నీ వ్యాధులతో మరణించారని గణాంకాలు చెబుతున్నాయి. ప్రాజెక్టు పనులు అప్పట్లో మందకొడిగా సాగడంతో కిడ్నీ బాధితుల వెతలు తీరలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా గుర్తించి ఆఖరి దశలో ఎదురైన సాంకేతిక సమస్యలను పరిష్కరించింది. కుదప సంపు నుంచి పది కిలోమీటర్ల పొడవైన భారీ పైప్‌లైన్ ద్వారా కృష్ణా జలాలను ఎ.కొండూరు మండలానికి తరలిస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని నిల్వ చేసేందుకు తండాల్లో ఉన్న 44 పాత ట్యాంకులను పునరుద్ధరించడంతో పాటు కొత్తగా మరో 12 ట్యాంకులను నిర్మించారు. మొత్తం 56 ట్యాంకుల ద్వారా గిరిజన తండాల్లోని ఇంటింటికీ నీటిని పంపిణీ చేయనున్నారు. ప్రారంభంలో కొత్తగా నిర్మించిన నాలుగు ట్యాంకులకు నీరు ఎక్కకపోవడంతో కొంత ఆందోళన నెలకొన్నప్పటికీ అధికారులు శక్తివంతమైన మోటార్లను ఏర్పాటు చేసి ఆ సమస్యను అధిగమించారు. ప్రస్తుతం ట్రయల్ రన్‌లో భాగంగా గ్రామాలకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే ప్రస్తుత ప్రాజెక్టు సామర్థ్యంపై ప్రజల నుంచి కొన్ని విన్నపాలు అందుతున్నాయి. రోజుకు 57 వేల మందికి తలసరి 50 లీటర్ల చొప్పున 22 లక్షల లీటర్లను పంపింగ్ చేసేలా ఈ లైన్‌ను రూపొందించారు. కానీ ప్రజల అవసరాలు వంద లీటర్లకు పైగా ఉండటంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల కొందరు మళ్లీ పాత బోర్ల నీటినే వాడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం 22 లక్షల లీటర్ల పరిమితిని దాటి అదనపు నీటిని అందించేందుకు ఎ.కొండూరుకు మరో ప్రత్యేక పైప్‌లైన్ వేసేలా కొత్త ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. ఈ ప్రాజెక్టును శనివారమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ.. ఆయన టూర్ రద్దవటంతో మరో ముహూర్తానికి వాయిదా పడింది. త్వరలోనే ఈ ప్రాజెక్టును ప్రజలకు పూర్తిస్థాయిలో అంకితం చేయనున్నారు.

## జాతరలో డిష్యుం... డిష్యుం



జాతరలో రెచ్చిపోయి ఫైట్ చేస్తున్నారట రవితేజ. ఎందుకంటే 'ఇరుముడి' సినిమా కోసం అన్నమాట. ఆయన హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఇరుముడి'. ఈ చిత్రంలో రవితేజ కుమార్తెగా బేబీ నక్షత్ర, భార్య పాత్రలో ప్రియా భవానీశంకర్ నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. రవితేజ పాల్గొనగా ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారట. ఈ ఫైట్ జాతర బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందట. తండ్రీకూతుళ్ల ఎమోషన్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని తెలిసింది.

## రీ షూట్ వార్తలపై టీమ్ క్లారిటీ..



ది ప్యారడైజ్ మూవీని ఎలాంటి రీ షూట్ చేయడం లేదని స్పష్టం చేశారు. కొద్ది రోజులుగా మా సినిమాకు సంబంధించి నిరాధారమైన, బాధ్యతారహితమైన ఊహాగానాలు వినిపిస్తున్నాయని అన్నారు. అంతా మేము అనుకున్న విధంగానే ముందుకు సాగుతోందని తెలిపారు. ఇప్పటికే 100 రోజులకు పైగా షూటింగ్ విజయవంతంగా పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన షెడ్యూల్ కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రణాళిక ప్రకారం జరుగుతోందని మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. దయచేసి సోషల్ మీడియాలో వచ్చే రీ షూట్ లాంటి వార్తలు ఎవరు నమ్మవద్దని మూవీ టీమ్ కోరింది. మా అధికారిక మాధ్యమాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని.. ఏదైనా ఉంటే మేమే నేరుగా వెల్లడిస్తామని పేర్కొన్నారు. అవాస్తవ కథనాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా.. ఈ చిత్రంలో విలన్ శికంజ మాలిక్ పాత్రలో మోహన్ బాబు నటిస్తున్నాడు. ఈ ఏడాది ఆగస్ట్ 21న థియేటర్లలో సందడి చేయనుంది.

# నలుగురు పిల్లల అమ్మాయితో పెళ్లి.. ఆసక్తిగా టీజర్

సూర్య వశిష్ట, దీప్షిక హీరో, హీరోయిన్లుగా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ రమణి కల్యాణం. ఈ ఎమోషనల్ డ్రామాకు విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్‌పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి. శ్రీనాథ్ పసుపులేటి, సంజయ్ వెంపరాల నిర్మిస్తున్నారు. కోర్ట్ మూవీ ఫేం రామ్ జగదీష్ డైలాగ్స్, స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సీనియర్ నటి జయసుధ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా జయసుధ మాట్లాడుతూ..'అందరికీ నమస్కారం. ఈ సినిమా నిర్మించిన నిర్మాతలకు అభినందనలు. ఈ సినిమాలో హీరో, హీరోయిన్‌లు అద్భుతంగా నటించారు. విజయ్ చాలా ప్యాషన్‌తో ఈ సినిమా తీశాడు. ఇది ఒక బ్యూటిఫుల్ ఫిల్మ్. ఈ మధ్యకాలంలో చిన్న సినిమాల్లో కూడా చాలా మంచి చిత్రాలు వస్తున్నాయి. 'రమణి కళ్యాణం' కూడా అలాంటి సినిమానే. మ్యూజిక్ కూడా చాలా అద్భుతంగా వచ్చింది. ఇది ఒక మంచి ఫీల్‌గుడ్ మూవీ. మే 22న ఈ సినిమా విడుదల అవుతోంది. అందరూ థియేటర్స్‌లో చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు. డైరెక్టర్ విజయ్ ఆదిరెడ్డి మాట్లాడుతూ.. 'అందరికీ నమస్కారం. ఇది మంచి టీమ్ సపోర్ట్‌తో చేసిన సినిమా. ఈ కథను నమ్మి పనిచేసిన అందరికీ థ్యాంక్స్. హీరో, హీరోయిన్‌లు చాలా ప్యాషన్‌తో సహజంగా పాత్రల్లో ఒదిగిపోయారు. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. రామ్ జగదీశ్ నా ఫ్రెండ్. ఈ సినిమాలో ఆయన చాలా చక్కని మాటలు రాశారు. నా రైటింగ్ టీమ్ అందరికీ థ్యాంక్యూ. సినిమాలు థియేటర్స్‌లోనే చూడాలి. ఆ అనుభూతి వేరు. అందరూ సినిమాలను థియేటర్స్‌లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను. మాకు ఎంతో సపోర్ట్ చేసిన జయసుధ గారికి ప్రత్యేక ధన్యవాదాలు' తెలిపారు. ఈ చిత్రంలో శ్రీనివాస్ రెడ్డి, శ్యామల, చైతు జొన్నల గడ్డ కీలక పాత్రల్లో నటించారు.



## ముగిసిన సమ్మర్ హాలీడేస్..
## 'వారణాసి' కొత్త షెడ్యూల్ ప్రారంభం




ప్రపంచ సినీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' ఇప్పుడు మరో కీలక దశలోకి అడుగుపెట్టింది. స్టార్ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కొత్త షెడ్యూల్ నేటి నుంచి ప్రారంభమవుతోంది. కొద్దిరోజుల విరామం తర్వాత మళ్లీ షూటింగ్ మొదలవుతుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా రూపొందించిన భారీ సెట్లలో ఈ తాజా షెడ్యూల్ చిత్రీకరణ జరగనుంది. ఇందులో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా సహా ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కించేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. ఈ షెడ్యూల్ పూర్తయ్యాక సినిమా యూనిట్ విదేశీ లొకేషన్లకు వెళ్లనున్నట్లు సమాచారం. ముఖ్యంగా కెన్యా, యూరప్‌తో పాటు మరికొన్ని అరుదైన ప్రదేశాల్లో చిత్రీకరణ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాను కేవలం ఇండియన్ మూవీగా కాకుండా అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని రాజమౌళి ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల మెక్సికోలో జరిగిన ఓ ఇంటర్నేషనల్ ఈవెంట్‌లో 'వారణాసి'ని పరిచయం చేసిన చిత్రబృందం.. త్వరలో ఫ్రాన్స్‌లో కూడా భారీ ప్రమోషన్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం విజువల్స్ పరంగా హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తీసిపోకుండా ఉండబోతుందనే టాక్ ఇప్పటికే ఇండస్ట్రీలో వినిపిస్తోంది. 'వారణాసి' కథ కూడా అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు సమాచారం. రామాయణంలోని కొన్ని కీలక ఘట్టాలను ఆధారంగా తీసుకుని.. ప్రపంచాన్ని చుట్టే ఓ సాహసికుడి ప్రయాణంలా ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. టైమ్ ట్రావెల్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ కథ వారణాసి నుంచి మొదలై కెన్యా, అంటార్కిటికా వరకు విస్తరించనుందట. ముఖ్యంగా రామాయణ యుద్ధం నేపథ్యంతో రూపొందిస్తున్న 25 నిమిషాల భారీ యాక్షన్ ఎపిసోడ్ ఈ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యుద్ధ సన్నివేశం కోసం దాదాపు 60 రోజుల పాటు షూటింగ్ నిర్వహించినట్లు సమాచారం. ఈ చిత్రంలో మహేష్ బాబు 'రుద్ర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారని టాక్. ప్రియాంక చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తుండగా.. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. 'వారణాసి' 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక నేటి నుంచి ప్రారంభమవుతున్న కొత్త షెడ్యూల్‌తో ఈ గ్లోబల్ ప్రాజెక్ట్ మరింత వేగంగా ముందుకు సాగనుంది.



## కొత్త ప్రపంచంలోకి...

'శంబాల' వంటి హిట్ మూవీ తర్వాత ఆది సాయికుమార్, యుగంధర్ ముని, షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు కాంబినేషన్‌లో మరో సినిమా ఖరారైంది. ఆది సాయికుమార్ హీరోగా యుగంధర్ ముని సమర్పణలో మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు నిర్మించనున్న ఈ చిత్రానికి బృందా రవీందర్ దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఆది మంచి మాస్ రోల్ చేయనున్నట్లు ఈ పోస్టర్ స్పష్టం చేస్తోంది. "ఎమోషన్స్‌తో పాటు హారర్ ఎలిమెంట్స్‌ను సరికొత్తగా చూపించనున్న చిత్రం ఇది. భయం, ఉత్కంఠ, అపరిమితమైన వినోదంతో ప్రేక్షకులను ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లేలా మా సినిమా ఉంటుంది. సంగీతానికి ప్రాధాన్యం ఉన్న కథ ఇది " అని దర్శక--నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881